బంగాళాఖాతంలో అల్పపీడనం

- రెండు రోజులు రెడ్ అలెర్ట్
- దక్షిణాది జిల్లాలను ముంచెత్తిన వాన
- సహాయక చర్యలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ దళం



వర్షపునీటిలో కోయంబత్తూరు బస్టాండు



నదిలా దర్శనమిస్తున్న కోయంబత్తూరులోని ఓ రోడ్డు

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఈ నెల 22న అల్పవాయుపీడనం ఏర్పడనుండటంతో దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. ఆ అల్పపీడనం వాయవ్యదిశగా ప్రయాణించి ఈనెల 24న మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారనుందని తెలిపారు. ఆది, సోమవారాల్లో కుండపోతగా వర్షాలు కురవనుండటంతో దక్షిణ రాష్ట్రానికి రెండు రోజుల రెడ్ అలెర్ట్ ప్రకటించారు. రాష్ట్రంలో శనివారం ఉదయం పలుచోట్ల చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఈనెల 21, 22 తేదీల్లోనూ రాష్ట్రంలో దక్షిణాది జిల్లాల్లో కుండపోతగా, చెదురుమదురుగా వర్షాలు కురవనున్నాయి. ఆదివారం నుంచి 21 వరకు తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి, తిరునల్వేలి జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్ర అధికారులు ప్రకటించారు. శనివారం సాయంత్రం తెన్‌కాశి, తేనీ, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం కన్నియాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, దిండుగల్ జిల్లాల్లో భారీగా, నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, తూత్తుకుడి, విరుదునగర్, మదురై, శివగంగ, రామనాధపురం, పుదుకోట జిల్లాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ఆదివారం కన్నియాకుమారి, మన్నార్ జలసంధి తదితర సముద్రతీర ప్రాంతాల్లో గంటలకు 40 నుంచి 45 కి.మీ. వేగంతో పెనుగాలులు వీస్తాయని, ఈ ప్రాంతాల్లో జాలర్లు ఈనెల 21 వరకు చేపలవేటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.



సహాయ సామగ్రితో బయలుదేరటానికి సిద్ధమవుతున్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ దళం సభ్యులు

నాలుగు జిల్లాల్లో సాయానికి రెడీ...

భారత వాతావరణ పరిశోధన కేంద్రం జారీ చేసిన రెడ్ అలెర్ట్ ప్రకారం నాలుగు జిల్లాల్లో వర్ష, వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలను ఆదుకోవడానికి రాష్ట్ర విపత్తుల నిర్వహణ దళం తగిన రక్షణ సామగ్రితో సిద్ధంగా ఉన్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటన జారీ చేసింది. ఆ మేరకు తలా 30 మంది సభ్యులు కలిగిన మూడు దళాలు తిరునల్వేలి, కన్నియాకుమారి, నీలగిరి జిల్లాలకు పయనమయ్యాయి. ఇదే విధంగా కోయంబత్తూరు జిల్లాకు కూడా ఓ బృందం తరలివెళ్లింది. రాష్ట్ర ప్రభుత్వ కోరిక మేరకు అరక్కోణంలోని జాతీయ విపత్తుల నిర్వహణ బృందం సభ్యులు కూడా సిద్ధమయ్యారు.

రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగ్యూ

- 4 వేల మందికి పైగా పీడితులు



ప్యారీస్, మే 18: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రారంభానికి ముందే డెంగ్యూ జ్వరం విజృంభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 4 వేలమందికి పైగా డెంగ్యూ జ్వర పీడితులు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలందుకుంటున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. 'ఎడిస్' దోమకాటు వల్ల డెంగ్యూ జ్వరం వ్యాప్తి నివారించేలా ఆరోగ్యశాఖ అవసరమైన చర్యలను వేగవంతం చేస్తోంది. అయినప్పటికీ, వర్షం కారణంగా నీటిగుంటలు, కూలర్లలో మిగిలిన నీరు, పాత టైర్లు, చెత్తకుండీలు, డ్రైనేజీ కాలువల్లో ఎడిస్ దోమలు పెరుగుతుండడం వల్ల వాటిని నిర్మూలించేందుకు మలేరియా విభాగ సిబ్బంది ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. ఈ నేపథ్యంలో, వర్షాకాలం ప్రారంభం కాక ముందే డెంగ్యూ జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంపై ఆరోగ్యశాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో జనవరిలో 1,200 మందికి పైగా డెంగ్యూ జ్వరపీడితులకు చికిత్సలందించినట్లు మెడికల్ రికార్డుల్లో నమోదైంది. నివారణ చర్యలు ముమ్మరం చేయడం వల్ల ఈ సంఖ్య మార్చి, ఏప్రిల్ నెలల్లో తగ్గింది. అయినప్పటికీ, మళ్లీ పలు జిల్లాల్లో డెంగ్యూతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. 2023లో రాష్ట్రంలో 8,953 మంది డెంగ్యూ జ్వరానికి గురికాగా, వారిలో చికిత్సలు ఫలించక ముగ్గురు మరణించారు. ఈ ఏడాది ఒక్కరు మాత్రమే ఈ జ్వరంతో మరణించినట్లు అధికారులు తెలిపారు. పెరంబలూరు, తేని, నామక్కల్, అరియలూరు, తిరువణ్ణామలై, దిండుగల్, కృష్ణగిరి, మదురై, కోయంబత్తూర్, తంజావూరు జిల్లాల్లో అంటువ్యాధుల వ్యాప్తికి కారణమైన క్రిముల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో డెంగ్యూ మాత్రమే కాకుండా చిన్న అమ్మవారు, విరేచనాలు, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. జ్వరం వచ్చిన ఐదవ రోజు నుంచి రెండు, మూడు రోజులు మరింత అప్రమత్తంగా ఉండాలని, కడుపు నొప్పి, రక్తస్రావం, నీరసం, బీపీ తగ్గిపోవడం, వాంతులు, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలుంటే వెంటనే బాధితులు వైద్యులను సంప్రదించాలని ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు.

ఓటమి భయంతోనే మోదీ విమర్శలు

ఆయన కలలు కల్లలు కావడం ఖాయం ● సీఎం స్టాలిన్ ధ్వజం



చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి విజయపథం వైపు దూసుకెళ్తుండటంతో, ఓటమి భయంతో ప్రధాని నరేంద్ర మోదీ తన స్థాయి మరచి నిత్యం దుష్ప్రచారాలు సాగిస్తున్నారని, ఆ అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేయాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రేక్షక పాత్ర వహించడం గర్హనీయమని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రిజర్వేషన్లను 50 శాతానికే పరిమితం చేయకూడదంటూ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, సామాజిక న్యాయం ఆశించే మేధావులు ఒత్తిడి చేస్తున్నారని, ఈ ప్రతిపాదన ఇండియా కూటమి ద్వారా జాతీయ స్థాయిలో ప్రతిధ్వనిస్తోందని తెలిపారు. ఈ ప్రతిపాదన ఉత్తరప్రదేశ్ ప్రజలకు లబ్ధి చేకూరుస్తుందన్నారు. అయితే దీనిపై ప్రధాని మోదీ ఇంతవరకూ ఎలాంటి వ్యాఖ్యలు గానీ ప్రశంసలు గానీ చేయలేదని స్టాలిన్ విమర్శించారు. ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ మతచిచ్చు రగిల్చేలా ప్రసంగించారని, ప్రస్తుతం రాష్ట్రాల నడుమ ఘర్షణ జరిగేలా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఉత్తరాది ప్రజలను తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ప్రజలు హేళనగా మాట్లాడుతున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వాస్తవానికి తమిళనాట ఉత్తరాది కార్మికులపై దాడులు జరిగాయంటూ దుష్ప్రచారం చేస్తున్న మనీష్ కశ్యప్ వంటి యూట్యూబర్లను పెంచి పోషిస్తున్నది బీజేపీ నాయకులేనని ధ్వజమెత్తారు. పదేళ్లలో దేశానికి చేసిన సేవలు గురించి మాట్లాడేందుకు ఏవీ లేకపోవడంతో ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పథకాలపై దుమెత్తి పోయడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. ప్రచార పర్వంలో ఇంతటి దుష్ప్రచారం చేసినా ఓట్లు రాలవని గ్రహించిన మోదీ... తాజాగా రాష్ట్రంలో సిటీ బస్సులు, టౌన్ బస్సుల్లో వెలుగుబాట పయనం పథకంలో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సదుపాయాన్ని బహిరంగంగా వ్యతిరేకించేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. వెలుగుబాట పయనం వల్ల నగరంలో మెట్రోరైళ్లలో ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయిందంటూ అసత్య ప్రచారం సాగిస్తుండటం గర్హనీయమన్నారు. నగరంలో మెట్రోరైలు సేవలు ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతూనే ఉంది తప్ప ఏ మాత్రం తగ్గలేదని గణాంకాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు 2019లో 4.28 కోట్ల మంది మెట్రోరైళ్లలో ప్రయాణించగా 2023లో ఆ సంఖ్య 9.11 కోట్లకు పెరిగిందన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా మెట్రోరైలు ప్రయాణికుల సంఖ్య తగ్గిందంటూ మోదీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టు అమలుకు ఇప్పటివరకూ కేంద్రం నుంచి విడుదల కాకుండా ప్రధాని మోదీ అడ్డుకుంటున్నారని, ఈ వాస్తవాన్ని దాచిపెట్టి మహిళల కోసం అమలు చేస్తున్న వెలుగుబాట పయన పథకాన్ని విమర్శించడం గర్హనీయమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న మోదీకి మహిళల అభివృద్ధిని చూసి భయపడుతున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ప్రధాని మోదీ రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టాలని కలలు కంటున్నారని, ఆ కలలు ఎన్నటికీ ఫలించవని స్టాలిన్ పేర్కొన్నారు.

అపూర్వం... వెలుగుబాట పయనం

- మహిళలకు ప్రతినెలా రూ.1283 పొదుపు
- రూ.3050 కోట్ల నిధుల కేటాయింపు

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం ప్రారంభమైన వెలుగుబాట పయనానికి మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, ఈ పయనం వల్ల ప్రతినెలా వారంతా రూ.1283 పొదుపు చేయగలుగుతున్నారని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.3050 కోట్లు కేటాయించినట్లు పేర్కొంది. ఈ పథకం ద్వారా 2021లో రోజుకు 35 లక్షల మంది సిటీ, టౌన్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని, ఈ యేడాది మార్చిలో రోజుకు 55లక్షల మంది మహిళలు ప్రయాణించారని రవాణా సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకం వల్ల నిరుపేద, మధ్య తరగతి వర్గాల మహిళలు ప్రతినెలా రూ.800ల నుంచి రూ.1283 దాకా పొదుపు చేయగలుగుతున్నారని వివరించారు. ఈ పథకం అమలుకు 5984 పింక్ కలర్ బస్సులు నడిపామని, ఫిబ్రవరి నుంచి అదనంగా 257 బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ఈ ఉచిత ప్రయాణం పథకం ద్వారా మే 9వ తేదీ వరకు 468 కోట్ల సార్లు మహిళలు ప్రయాణించారన్నారు. ఈ ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల్లో 60 శాతం మంది 40 యేళ్లలోపు వారేనని తెలిపారు.





తన ఇంటికి విద్యుత్ వెలుగు రావటంతో సంతోషపడుతున్న దుర్గాదేవి

చిన్నారికి ప్రభుత్వ చేయూత

- గుడిసెలో కొవ్వొత్తి వెలుగులో చదివి టెన్త్ పాసైన బాలిక
- ఇంటికి ఉచిత విద్యుత్ కనెక్షన్



చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా లేని పూరిగుడిసెలో కొవ్వొత్తి వెలుగులో చదివి టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలైన విద్యార్థి ఇంటికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసింది. తిరువారూరు జిల్లా కొరట్టాచేరి ప్రభుత్వ బాలికల పాఠశాలలో దుర్గాదేవి అనే బాలిక 492 మార్కులలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించిన దుర్గాదేవి తండ్రి బాలా మెకానిక్. పాసైన సందర్భంగా బాలిక విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలేని పూరిగుడిసెలో ఉంటూ కొవ్విత్తి వెలుగులో కష్టపడి చదివి పాసయ్యానని తెలిపింది. ఈ సంతోష సమయాన తన ఇంటికి ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్ ఇస్తే బాగుంటుందని పేర్కొంది. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. బాలిక ఇంటికి ఉచిత విద్యుత్ కనెక్షన్ జారీ చేయాలంటూ జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో తిరువారూరు శాసనసభ్యుడు పూండి కలైవానన్, విద్యుత్ బోర్డు అధికారులు దుర్గాదేవి నివసిస్తున్న ఇంటిని పరిశీలించారు. ఆ తర్వాత ఆమె ఇంటి వరకూ కొత్తగా మూడు విద్యుత్ స్తంభాలు నాటి ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. శనివారం నుంచి దుర్గాదేవి ఇంట విద్యుత్ వెలుగులు పరుచుకున్నాయి. ఈ సందర్భంగా ఆ బాలిక మాట్లాడుతూ... ఇకపై విద్యుత్ దీపాల వెలుగులో చదివి ఉన్నత చదువుల్లోనూ ఫస్ట్‌క్లాస్‌లో పాసవుతానని, తమ ఇంటికి ఉచిత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు పేర్కొంది.

నేత్రపర్వంగా వాసవి మాత జయంతి

- ఎస్కేపీడీలో ప్రత్యేక పూజలు





గిడ్డంగి వీధి నుంచి అమ్మవారికి సారె, పాల కలశాల ఊరేగింపును ప్రారంభిస్తున్న శివ అధ్యక్షుడు అజంతా శంకరరావు - అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాల కలశాల ఊరేగింపును ప్రారంభిస్తున్న గోపురం కుంకుమ సంస్థ అధినేత వైవీ హరికృష్ణ

ప్యారీస్, మే 18: స్థానిక జార్జిటౌన్ ఆదియప్ప వీధిలో మూడు వందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ) ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి ఉత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. ఎస్కేపీడీ పాలక మండలి సభ్యులు చేపట్టిన భారీ ఏర్పాట్ల మధ్య కళాశాల ప్రాంగణంలో ఉదయం 6 గంటలకు కన్యకా పరమేశ్వరి మూలవిరాట్టు, ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు త్రికాల అభిషేకాలతో పాటు మహాయాగం, ధూపదీపారాధనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ నుంచి వాహనంలో నగరానికి తీసుకొని వచ్చిన వాసవి జ్యోతికి ఎస్కేపీడీ ట్రస్టీలు ఘనస్వాగతం పలికారు. ఈ జ్యోతిని చెట్‌పెట్, గోవిందప్పనాయకన్ వీధి సహా నగరంలోని పలు ప్రాంతాల్లో ఊరేగించారు. వాసవి అమ్మవారి జన్మ విశిష్టత, 102 గోత్రాల వారు చేపట్టాల్సిన ఆచారాల గురించి పలువురు ఉపన్యసించారు. 1008 మంది మహిళలు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చిన క్షీరకలశాలను పూజల్లో ఉంచిన అనంతరం అమ్మవారికి నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. వాసవి జయంతి సందర్భంగా ఎస్కేపీడీలో ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు, భజన, సహస్రనామార్చన, అన్నదానం నిర్వహించారు.



వాసవి జ్యోతికి స్వాగతం పలుకుతున్న ఎస్కేపీడీ ట్రస్టీలు

అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం...

అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి జయంతిని పురస్కరించుకొని గోపురం పసుపు కుంకుమ కార్యాలయం నుంచి 108 క్షీరకలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా సంఘ అధ్యక్షుడు వైవీ హరికృష్ణ ఊరేగింపును జెండా ఊపి ప్రారంభించి ఆలయానికి చేరుకొని వాసవాంబకు అభిషేకాలు, అలంకరణ పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సంఘ నిర్వాహకులు కాశీ విశ్వనాథం, ఎస్వీ ప్రసాదరావు, అంకం శ్రీనివాసులు, ముక్కాల భాష్యకారులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సదరన్ ఇండియా వైశ్య సంఘంలో...

గిడ్డంగి వీధిలోని సదరన్ ఇండియా వైశ్యసంఘం (శివ) కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు అజంతా గ్రూప్ అధినేత డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, విజయలక్ష్మి దంపతుల నేతృత్వంలో వాసవి జయంతి మహోత్సవం ఘనంగా జరిగింది. వైశాఖ శుక్ల పక్ష దశమి, పునర్వసు నక్షత్ర శుభలగ్నంలో లోక కల్యాణార్థం అమ్మవారిని విశేషంగా అలంకరించి, 300 మందికిపైగా ముత్తయిదువులు కుంకుమార్చన నిర్వహించారు. సంఘ గౌరవ కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్‌కుమార్, కోశాధికారి పెనల రమేష్ తదితరులు క్షీరకలశాల ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే, గోమాత సేవా సమితి తరపున గోపూజ, అభిషేకాలను సమితి వ్యవస్థాపకులు దయాళన్ వాసుదేవన్, పుష్పాంబాల్ తదితరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ గ్రేటర్ చెన్నై చైర్మన్ కేకే త్రినాథ్‌కుమార్ అధ్యక్షతన తిరూర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి ప్రాజెక్ట్ చైర్మన్ ఎస్వీ పద్మనాభం పర్యవేక్షణలో వాసవి జ్యోతితో బయల్దేరిన యాత్ర ఎస్కేపీడీ ఆలయానికి చేరుకున్న అనంతరం జ్యోతిని ట్రస్టీలకు అప్పగించారు.

సమాచార దర్శిని

విద్యార్థినుల అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మే 18: స్థానిక అంబత్తూర్ ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థినుల అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ జూన్ 7వ తేది వరకు జరగనుంది. 8వ తరగతి, టెన్త్ ఉత్తీర్ణత, ప్లస్ టూ పాస్, ఫెయిలైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి లేదు. ఏడాది వృత్తి విభాగాలైన టైలరింగ్ టెక్నాలజీ, స్టెనోగ్రఫీ (తమిళ్, ఇంగ్లీషు) వంటి వివిధ పాఠ్యాంశాల్లో శిక్షణ ఇస్తారు. బస్‌పాస్, సైకిల్, ప్రతినెలా రూ.750 ఉపకార వేతనం, మ్యాప్‌లు, యూనిఫాం, షూస్ తదితరాలు ఉచితంగా అందజేస్తారు. ఇతర వివరాలకు www.skilltraining.tn.gov.in లో సంప్రదించవచ్చు.

రూ.96.50 కోట్లతో వాననీటి కాలువలు

ఐసిఎఫ్, మే 18: స్థానిక తాంబరంలో రూ.96.50 కోట్ల తో వాననీటి కాలువల నిర్మాణపనులు జరగనున్నాయి. ఇరుంబులియూర్ నుంచి అడయార్ నది వరకు 3.8 కిలోమీటర్ల మేర కాలువల నిర్మాణాలు చేపట్టనున్నారు. 24 నెలల్లో ఈ పనులు పూర్తవుతాయని, ప్రస్తుతం 10 శాతం పనులు ముగిశాయని అధికారులు తెలిపారు.

22 నుంచి ఏర్కాడులో వేసవి ఉత్సవాలు

పెరంబూర్, మే 18: సేలం జిల్లాలోని పర్యాటక కేంద్రం ఏర్కాడులో ఈ నెల 22వ తేది నుంచి వేసవి ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రంలో ఊటీ, కొడైకెనాల్ తర్వాత ఏర్కాడు వేసవి విడిది కేంద్రంగా పేరుగాంచింది. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు ఖర్చులు కూడా తక్కువగా ఉండడంతో 'పేదల ఊటీ'గా పిలుస్తుంటారు. వేసవి సీజన్‌లో ఏర్కాడు వచ్చే పర్యాటకులకు మరింత ఆహ్లాదం కలిగించేలా జిల్లా ఉద్యానవన, వ్యవసాయ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వేసవి ఉత్సవాలు నిర్వహి స్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది వేసవి ఉత్స వాలు, పుష్ప ప్రదర్శన ఈనెల 22 నుంచి 26వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బృందాదేవి తెలిపారు

తగ్గిన నోటు పుస్తకాల ధరలు

ఐసిఎఫ్, మే 18: నోటు పుస్తకాల ధరలు 15 శాతం తగ్గాయి. చెన్నై, మదురై, శివకాశికి చెందిన సంస్థలు వివిధ పేర్లతో నోటు పుస్తకాలు విక్రయిస్తున్నాయి. ఈ పుస్తకాల తయారీకి వినియోగించే క్రిమో పేపర్ గత ఏడాది టన్ను రూ.74,000 ధర ఉండగా, ఈ ఏడాది రూ.61,000కు తగ్గింది. వీటితో పాటు నోటు పుస్తకాల తయారీకి వినియోగించే నూలు, జిగురు ధరలు తగ్గాయి. ఈ కారణంగా తయారీదారులు గత ఏడాది కన్నా 10 నుంచి 15 శాతం వరకు ధరలు తగ్గించారు. గత ఏడాది రూ.180 నుంచి రూ.200 వరకు ఉన్న నోటు పుస్తకం ధర రూ.150 నుంచి రూ.170 వరకు తగ్గింది.

కట్ట కొత్తిమీర రూ.20

ఐసిఎఫ్, మే 18: మార్కెట్లో కట్ట కొత్తిమీర రూ.20కు విక్రయమవుతోంది. తూత్తుకుడి, విరుదునగర్, రామనా థపురం వంటి వివిధ జిల్లాల్లో రైతులు కొత్తిమీర సాగు చేస్తున్నారు. ఏప్రిల్‌లో సాగుచేసిన కొత్తిమీర కోతకు సిద్ధంగా ఉండగా, అకాలవర్షాలతో పంట దెబ్బతినింది. ఈ కారణంగా కోయంబేడు మార్కెట్లో రూ.3 నుంచి రూ.5 వరకు విక్రయమైన కొత్తిమీర కట్ట రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు.

24న సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, మే 18: సామాజిక భౌతిక శాస్త్రవేత్త, క్రౌడ్ ఇంటర్వ్యూయర్ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 24వ తేది స్థానిక బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరగనుంది. ఈ పోస్టుల భర్తీకి 2023 డిసెంబరులో పరీక్షలు నిర్వహించగా, ఇటీవల ఫలితాలు విడుదలయ్యాయి. 24వ తేది జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించిన వివరాలు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

హొగెనేకల్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ఐసిఎఫ్, మే 18: హొగెనేకల్‌కు ఇన్‌ఫ్లో 1,500 ఘనపుటడుగులకు తగ్గింది. కర్ణాటక, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కొన్నిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా కావేరి నదిలో ఇన్‌ఫ్లో పెరగడం, తగ్గడం జరుగుతోంది. ధర్మపురి జిల్లా హొగెనేకల్, కృష్ణగిరి జిల్లా అంజెట్టి, నాట్రాంపాళయం, హోసూరులో కురిసిన వర్షా లకు హొగెనేకల్‌లో శుక్రవారం 3,000 ఘనపుట డుగులుగా ఉన్న ఇన్‌ఫ్లో, శనివారం ఉదయం 1,500 ఘనపుటడుగులకు తగ్గింది.

సెల్‌ఫోన్ యాప్ ద్వారా మోసం

● ఐదుగురి అరెస్ట్

ప్యారీస్, మే 18: సెల్‌ఫోన్ యాప్ ద్వారా మహిళలా మాట్లాడి మగవారిని బుట్టలో వేసుకొని నగదు దోచుకున్న ఐదుగురిని గ్రేటర్ చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వ్యాసర్పాడి మూడవ పల్లం వీధికి చెందిన దామోదరన్ (24) జనవరిలో ఆన్‌లైన్ యాప్ ద్వారా అఖిల అనే మహిళతో మాట్లాడి ఆమెకు రూ.500 పంపించారు. ఆ తర్వాత ఫిబ్రవరి 2న దామోదరన్‌ను సంప్రదించిన గుర్తుతెలియని వ్యక్తులు తాము సైబర్ క్రైం పోలీసులమని, అఖిల అనే మహిళ ఆత్మహత్య చేసుకోవడానికి కారణం మీరేనంటూ బెదిరించి రూ.13,500 వసూలుచేసినట్లు తెలిసింది. ఈ రకంగా నగరంలో పలువుర్ని మహిళలా మాట్లాడి డబ్బు దోచుకున్న వ్యవహారంపై అందజేసిన ఫిర్యాదు మేరకు పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ జారీచేసిన ఉత్తర్వులతో సైబర్ క్రైం పోలీసులు రంగంలో దిగారు. పట్టాభిరామ్‌కు చెందిన లియోదురై, శ్రీనివాసన్, తమిళన్, మహ్మద్ రియాజ్, పృథ్వీరాజ్‌ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు జైలుకు తరలించారు.

9 కిలోల గంజాయి స్వాధీనం

ఐసిఎఫ్, మే 18: ఈరోడ్ రైల్వేస్టేషన్‌లో 9 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈరోడ్ రైల్వేస్టేషన్‌లో ఇటీవల గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. జార్ఖండ్ రాష్ట్రం టాటానగర్ నుంచి కేరళ రాష్ట్రం ఎర్నాకుళం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఈరోడ్‌కు శుక్రవారం రాత్రి చేరుకుంది. రైలు బోగీలోని ఓ టాయిలెట్ సమీపంలో 9 కిలోల గంజాయి ప్యాకెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, గంజాయి తరలిస్తున్న వారి కోసం విచారిస్తున్నారు.

జూన్ 24న రవాణా కార్మికుల నిరాహార దీక్ష

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): వేతన ఒప్పందాలపై చర్చలు జరపాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా రవాణా సంస్థ కార్మికులు జూన్ 24న నిరాహార దీక్ష చేయనున్నట్లు కార్మిక సంఘాల సమాఖ్య ప్రకటించింది. రాష్ట్రంలో వంద ప్రాంతాల్లో ఈ ఆందోళన జరుగుతుందని పేర్కొంది. విల్లుపురంలో జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు సమాఖ్య అధ్యక్షుడు సౌందరరాజన్ తెలిపారు.

తిరుచెందూర్‌కు పోటెత్తుతున్న పాదయాత్ర భక్తులు



ఐసిఎఫ్, మే 18: వైకాశి విశాఖ ఉత్సవాలను పురస్కరించుకొని తిరుచెందూర్ మురుగన్ ఆలయా నికి పాదయాత్ర భక్తులు భారీగా తరలివస్తున్నారు. సుబ్రమణ్యస్వామి ఆరు దివ్యక్షేత్రాల్లో రెండో క్షేత్రమైన తిరుచెందూర్ ఆలయంలో యేటా వైకాశి విశాఖ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. మురుగన్ అవతరించిన వైకాశి విశాఖ రోజున ఆయన్ను పూజిస్తే ఏడాది పొడవునా ఆరాధించిన ఫలితం దక్కుతుందన్నది భక్తులు నమ్మకం. ఉత్సవాలను పురస్కరించుకొని 21వ తేది వేకువజామున 3 గంటలకు ఆలయాన్ని తెరచి, 3.30 గంటలకు విశ్వరూప దీపారాధన, 5 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, ఉదయం 10.30 గంటలకు ఉచ్చికాల అభిషేకం, దీపారాధనలు, సాయంత్రం 4 గంటలకు సాయరక్ష దీపారాధన, రాత్రి 7.15 గంటలకు రాత్రి కాలాభిషేకాలు నిర్వహించనున్నారు. 22వ తేది వేకువజామున 1 గంటకు ఆలయాన్ని తెరి చి 1.30 గంటలకు విశ్వ రూప దీపారాధన, 4 గంట లకు ఉదయ మార్తాండ అభిషేకం, దీపారాధన, ఉదయం 10.30 గంటలకు మూలవిరాట్టుకు ఉచ్చికాల అభిషేకం, షణ్ముఖుడికి ప్రత్యేక అభిషేకం, సాయం త్రం 4 గంటలకు సాయ రక్ష దీపారాధన నిర్వహి స్తారు. అనంతరం స్వామి వారు జయేంద్రనాథర్ వసంత మండపంలో కొలువుదీరతారు. అక్కడ ముని కుమారులకు శాపవిమోచన కార్యక్రమం, రాత్రి 7.15 గంటలకు అభిషేకాలు జరుగుతాయి. 23వ తేది కూడా ప్రత్యేక దీపారాధనలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పాదయాత్రగా తరలి వస్తున్నారు. వీరి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

చెరువును తలపిస్తున్న టి.నగర్ బస్టాండ్



చిన్నపాటి వర్షానికే జలమయమైన టి.నగర్ బస్టాండ్

పెరంబూర్, మే 18: స్థానిక టి.నగర్ బస్టాండ్ చిన్నపాటి వర్షానికే భారీగా నీరు నిలిచి చెరువును తలపిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో ప్రముఖ వాణిజ్య కేంద్రం టి.నగర్. నిత్యం ప్రజలతో రద్దీగా కనిపిస్తుంది. టి.నగర్ బస్‌స్టేషన్ నుంచి నగరం, శివారు ప్రాంతాలకు సిటీ బస్సులు నడుపుతున్నారు. ఈ బస్టాండ్ నిత్యం ప్రయాణికులతో కిటకిటలా డుతుంటోంది. అదే సమయంలో ఈ బస్టాండ్ ఉన్న ప్రాంతం రోడ్డు ఎత్తుకు దిగువగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే భారీగా నీరు చేరుతోంది. దీంతో, నీళ్లలో వెళుతూ బస్సులు ఎక్కేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాగా, ఈ బస్టాండ్, డిపో ప్రాంతాలు రూ.67 కోట్లతో పునరుద్ధరించాలని ప్రణాళికలు రూపొందించారు. ఆ ప్రకారం, మూడు అంతస్తులతో కూడిన ఈ బస్టాండ్‌లో బేస్మెంట్‌లో వాహనాల పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్టాండ్, మొదటి అంతస్తులో డిపో, రెండు, మూడవ అంతస్తులో వాణిజ్యం సంస్థలు ఏర్పాటు చేయాలని రూపొందించిన ప్రణాళిక ఆచరణలో అమలుకు నోచుకోలేదు. స్మార్ట్ సిటీ పథకంలోనైనా ఈ బస్టాండ్ పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడా మైదానంగా మారిన పూండి జలాశయం



పూండి జలాశయంలో క్రికెట్ ఆడుతున్న యువకులు


పెరంబూర్, మే 18: నగరవాసులకు తాగునీరు అందించే జలాశయాల్లో ఒకటైన పూండి జలాశయం ప్రస్తుతం క్రీడా మైదానంగా కనిపిస్తోంది. చుట్టుపక్కల ప్రాంతాల్లోని అడవుల్లో కురిసే వర్షపు నీరు, ఆంధ్ర రాష్ట్రం కండలేరు నుంచి విడుదల చేసే నీటిని ఈ జలాశయంలో నిల్వచేసి, బేబి కాలువ, ప్రధాన కాలువల ద్వారా చోళవరం, పుళల్ జలాశయాలకు తరలిస్తుంటారు. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 3.23 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.64 టీఎంసీల నీటినిల్వలు మాత్రమే ఉన్నాయి. జలాశయ పరీవాహక గ్రామాలైన పుల్లరంబాక్కం, పాండూరు, పట్టరై పెరుంబుదూర్ తదితర ప్రాంతాల్లో నీరు లేకుండా ఎండిపోయి కనిపిస్తోంది. దీంతో, ఆ గ్రామాల యువకులు క్రికెట్ ఆడుకుంటూ, మరోవైపు మేత మేస్తున్న పశువులతో జలాశయం దర్శనమిస్తోంది.

తిరుచెందూర్ తీరంలో 'జెల్లీ' చేపలు



పెరంబూర్, మే 18: తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సముద్రతీరంలో అధికంగా జెల్లీ చేపలు సంచరిస్తుండడంతో భక్తులు అప్రమత్తంగా ఉండాలని తీరప్రాంత భద్రతా విభాగం అధికారులు హెచ్చరిస్తున్నారు. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి వచ్చే భక్తులు సమీపంలోని సముద్రతీరంలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటుంటారు. ఈ నేపథ్యంలో, కొద్దికాలంగా ఈ ప్రాంతంలో జెల్లీ చేపలు సంచరిస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ చేపల సంచారం ఉంటుందని, చూసేందుకు అద్దంలా కనిపించే ఈ చేపలు విషతత్వంతో కూడుకొని ఉన్నాయని, తీరంలో స్నానం చేసే భక్తులు వీటిని తగిలితే చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయని, కొన్ని సమయాల్లో చర్మం కాలినట్లు మంట పుడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా, ఇలాంటి సమస్యలు తలెత్తే భక్తులకు చికిత్సలందించేలా ఆలయ ప్రాంగణంలో ప్రథమ చికిత్సా కేంద్రం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే, జెల్లీ చేపలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఆయ జాయింట్ డైరెక్టర్ కార్తీక్ తెలిపారు.

పట్టుబడిన చిరుత



బోనులో పట్టుబడిన చిరుత

పెరంబూర్, మే 18: తిరునల్వేలి జిల్లా పాపనాశం సమీపంలో సంచరిస్తున్న చిరుత బోనులో చిక్కింది. కొద్దిరోజులుగా వెంబయాపురం, తిరుపతియాపురం తదితర గ్రామాల్లో సంచరిస్తున్న చిరుత... మేకలు, కుక్కలపై దాడి చేస్తోంది. దీంతో, ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ప్రజలు రాత్రి వేళల్లో నిద్రలేకుండా జాగారం చేస్తున్నారు. ఈ చిరుతను బంధించేందుకు అటవీ శాఖ అధికారులు ఐదు ప్రాంతాల్లో బోనులు ఏర్పాటుచేశారు. శుక్రవారం రాత్రి ఆ ప్రాంతానికి వచ్చిన చిరుత, బోనులో కట్టిన మేకను చూసి అందులో ప్రవేశించి చిక్కుకుంది. అధికారులు, వెటర్నరీ వైద్యులు అక్కడకు చేరుకొని చిరుతను పరిశీలించారు. ఐదేళ్ల ప్రాయం కలిగిన ఈ చిరుతను మణిముత్తారు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

జిప్మర్ వైద్యకళాశాలకు నేషనల్ ఎస్సీ కమిషన్ నోటీసు

పుదుచ్చేరి, మే 18: పుదుచ్చేరి రాష్ట్రంలోని జిప్మర్ వైద్యకళాశాలలో చేరిన విద్యార్థులను కులాల పేరుతో చిత్రహింసలు పాల్జేసిన వ్యవహారంపై వివరణ కోరుతూ నేషనల్ ఎస్సీ కమిషన్ జిప్మర్ యాజమాన్యానికి నోటీసు జారీ చేసింది. ఈ కళాశాలలో పీహెచ్‌డీ స్కాలర్లను ప్రొఫెసర్లు వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గత జనవరి 5న బాధిత ఎస్సీ స్కాలర్ తనకు చేయాలంటూ ఎస్సీ కమిషన్‌కు లేఖ రాశారు. దీనిపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టాలంటూ ఎస్సీ కమిషన్ జారీచేసిన ఆదేశాలను పాటించలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో, బాధిత స్కాలర్ ఫిర్యాదుపై ఎందుకు చర్యలు చేపట్టలేదో కారణం కోరుతూ ఎస్సీ కమిషన్ జిప్మర్ వైద్యకళాశాల డైరెక్టర్, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది. దీనిపై ఎస్సీ కమిషన్ డైరెక్టర్ రవివర్మన్ శనివారం మీడియాతో మాట్లాడుతూ... నోటీసు అందిన 15 రోజుల్లో పూర్తి వివరాలతో నివేదిక సమర్పించకుంటే తదుపరి చర్యగా అధికారులకు సమన్లు జారీ చేస్తామని తెలిపారు.

2నుంచి మామిడిపండ్ల ఉత్సవాలు



చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): హను రెడ్డి మ్యాంగో టూరిజం ఆధ్వర్యంలో నగర శివార్లలోని ఒత్తివాక్కంలో జూన్ 2న మామిడి పండ్ల ఉత్సవాలు ప్రారంభమవుతాయని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలను జూన్ 8, 16, 23 తేదీలలోనూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 156 అడుగుల హనూస్ టేబుల్‌పై మామిడి, మామిడి పండ్లతో తయారైన పదార్థాలను88 పంపిణీ చేస్తామన్నారు. హనురెడ్డి రాఘవ ఫామ్స్‌లో జరిగే ఈ వేడుకలను మామిడి పండ్ల కీర్తిని పెంచేలా భావితరాలకు మామిడి రుచులు తెలిసేలా జరుపుతామని సంస్థ నిర్వాహకుడు హనురెడ్డి తెలిపారు. ఈవేడుకలలో పాల్గొనదలచినవారు ముందుగా టిక్కెట్లను బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు.

పరిశ్రమల శిక్షణ కేంద్రం పరిశీలన



శిక్షణ కేంద్రం పరిశీలిస్తున్న అడిషనల్ ప్రధాన కార్యదర్శి కుమార్ జయంత్, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, మే 18: కార్మిక సంక్షేమం, వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ అదనపు ప్రధాన కార్యదర్శి కుమార్ జయంత్ శనివారం స్థానిక ప్రభుత్వ పరిశ్రమల శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, మండల జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ (చెన్నై ఉద్యోగ అవకాశాలు, శిక్షణ), ప్రభుత్వ పరిశ్రమల కేంద్ర ఉప డైరెక్టర్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యా సామగ్రి అందిస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, మే 18: ఆర్థిక స్థోమత లేని ఇద్దరు విద్యార్థినులకు సమాజ సేవకుడు దినేష్ శరవణన్ చేయూతనందించారు. సత్తువాచేరికి చెందిన ఉషారాణి భర్త చనిపోవడంతో తన ఇద్దరు కుమార్తెలతో అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఇంటి పనులు చేసి వచ్చే రూ.1,500 నుంచి రూ.2,000 వరకు వచ్చే ఆదాయంతో ఆమె కుటుంబాన్ని పోషిస్తోంది. ఇద్దరు ఆడపిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో, స్థానిక అలిమేలు మంగాపురం ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్ విద్యార్థినుల పరిస్థితి తెలుసుకొని వారికి విద్యా ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ శరవణన్ మాట్లాడుతూ.. విద్యార్థినుల విద్య అవసరమైన సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ప్రభుత్వం తరఫున కూడా విద్యార్థినులకు సాయం అందేలా ఏర్పాటుచేస్తానని ఆయన తెలిపారు.

రద్దీ ప్రాంతాల్లో వేలాడుతున్న ట్యూబ్ లైట్లు



ప్రమాదస్థితిలో ట్యూబ్ లైట్లు

వేలూరు, మే 18: స్థానిక సత్తువాచ్చేరి సబ్‌వేలో ట్యూబ్ లైట్ ప్రమాదకర స్థితిలో వేలాడుతోంది. దీని వలన ప్రజలకు ఏ సమయంలోనైనా ప్రమాదం జరిగే అవకాశముంది. ఈ ట్యూబ్ లైట్‌ను అధికారులు సరిచేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

డెంగ్యూపై అవగాహన ప్రచారం



డెంగ్యూ అవగాహన కార్యక్రమంలో కార్పొరేషన్ ఉద్యోగులు

వేలూరు, మే 18: కార్పొరేషన్ కమిషనర్ జానకి ఉత్తర్వుల మేరకు 1వ మండల పరిధిలోని కాట్పాడిలో ప్రజలకు డెంగ్యూ జ్వరం వ్యాప్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారి మునుస్వామి, కార్పొరేషన్ సంక్షేమ అధికారి గణేశ్, ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్, జనరల్ శుభ్రతా శాఖ మేనేజర్ శరవణన్, సూపర్‌వైజర్లు సంయుక్తంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి



పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించిన కార్యకర్తలు

వేలూరు, మే 18: కేసును తప్పుదారి పట్టిస్తున్నారంటూ పోలీస్‌స్టేషన్‌ను హిందూ మున్నని కార్యకర్తలు ముట్టడించార. ఈ ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. హిందూ మున్నని ప్రధాన కార్యదర్శి రాందాస్ ఈనెల 10వ తేది రాత్రి 11.30 గంటలకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ఏరికానారు ప్రాంతంలో మరో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు అతనిపై దాడిచేశారు. గాయపడిన అతన్ని స్థానికులు సత్తువాచేరి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తనపై దాడి చేసింది కంబత్తమ్‌పారైపేటకు చెందిన లోకనాథన్, తమిళ్‌వానన్ అని రాందాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై విచారించిన పోలీసులు దాడికి పాల్పడింది లోకనాథన్, తమిళ్‌వానన్ కాదని తేల్చారు. దీంతో, పోలీసులు ఉద్దేశపూర్వకంగా కేసును పక్కదోవ పట్టిస్తున్నారంటూ హిందూ మున్నని కార్యకర్తలు లత్తేరి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మూడు షిఫ్టుల పనివేళలు

ప్యారీస్, మే 18: ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న సి-గ్రేడ్ ఉద్యోగులకు ఇక నుంచి మూడు షిఫ్టుల పనివేళలు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. రాష్ట్రప్రభుత్వ ఆరోగ్యశాఖ నిర్వహణలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాలలు, ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న నర్సులు, సి-గ్రేడ్ ఉద్యోగులు, పరిశుభ్రత కార్మికులు ఇక నుంచి మూడు షిఫ్టుల విధుల్లో పాల్గొంటారు. ఆ మేరకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఒంటి గంట నుంచి రాత్రి 9 వరకు, రాత్రి 8 నుంచి మరుసటిరోజు ఉదయం 6 గంటల వరకు పనివేళలను ప్రభుత్వం కేటాయించింది. మొత్తం ఆరోగ్యశాఖ సి-గ్రేడ్ ఉద్యోగుల్లో 50 శాతం మంది మొదటి షిఫ్టు, 25 శాతం మంది సెకండ్ షిఫ్టు, మరో 25 శాతం మంది మూడవ షిఫ్టులో విధులు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం జీవోలో తెలిపింది.

పట్టినంబాక్కంలో చేపల దుకాణాల తొలగింపు



పోలీసుల సహాయంతో పట్టినంబాక్కం రహదారిలో చేపల దుకాణాలను తొలగిస్తున్న కార్పొరేషన్ అధికారులు - తన దుకాణాన్ని తొలగించడంతో దిగాలుగా కూర్చున్న చేపలు విక్రయించే మహిళ

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): మెరీనా బీచ్‌ను ఆనుకుని పట్టినంబాక్కం రహదారిని ఇరువైపులా ఆక్రమించుకుని నడుపుతున్న చేపల దుకాణాలను శనివారం ఉదయం కార్పొరేషన్ అధికారులు పోలీసుల సాయంతో తొలగించారు. దీంతో వందకు పైగా చేపల దుకాణాల యజమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిని ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నవారికి పలుమార్లు నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పోలీసులను వెంటబెట్టుకుని వెళ్ళి కార్పొరేషన్ అధికారులు ఆ దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా చేపల వ్యాపారులకు అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

మలేసియా వర్శిటీతో చెన్నైస్ అమృత కాలేజ్ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): 'చెన్నైస్ అమృత కాలేజ్' మలేసియాకు చెందిన 'యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఏవియేషన్'తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు అర్హులైన చెన్నైస్ అమృత కాలేజ్ విద్యార్థులు తమ మూడు సంవత్సరాల బీఎస్సీ ఏవియేషన్, బీబీఏ ఎయిర్‌లైన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో మొదటి, రెండో సంవత్సరం చెన్నైలో, తృతీయ సంవత్సరం మలేసియాలో శిక్షణ పొందుతారు. దీంతో విద్యార్థులకు హిందీ, గ్రూమింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఐఏటీఏ సర్టిఫికేషన్, ఎయిర్ టికెటింగ్ వంటివి కలిపి శిక్షణగా అందిస్తారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో చెన్నైస్ అమృత ఇంటర్నేషనల్ ఏవియేషన్ కళాశాల అధినేత ఆర్.భూమినాథన్, మలేసియా యూనివర్శిటీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ కెప్టెన్ అబ్ మనస్ బిన్ మాన్సోర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

యువజన విభాగం నేతలతో మంత్రి ఉదయనిధి సమావేశం



సమావేశంలో మంత్రి ఉదయనిధి

పెరంబూర్, మే 18: డీఎంకే యువజన విభాగం నిర్వాహకులతో ఆ విభాగ ప్రధాన కార్యదర్శి, మంత్రి ఉదయనిధి స్టాలిన్ సమావేశమవుతున్నారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో శనివారం తిరుపత్తూర్, రాణిపేట, వేలూరు జిల్లా యువజన విభాగం నిర్వాహకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేసిన యువజన విభాగ నిర్వాహకులకు పార్టీలో మంచి పదవులు కల్పిస్తామని, అదే సమయంలో ఎన్నికల్లో సక్రమంగా పనిచేయని వారిపై చర్యలుంటాయని ఈ సందర్భంగా మంత్రి ఉదయనిధి హెచ్చరించినట్లు సమాచారం.

తిరుత్తణి ఆలయ హుండీ ఆదాయం రూ.కోటి



లెక్కింపులో ఆలయ సిబ్బంది

పెరంబూర్, మే 18: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధిచెందిన మురుగన్ ఆలయానికి ప్రతిరోజు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. కోర్కెలు తీరిన, స్వామిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హుండీల్లో కానుకలు సమర్పిస్తుంటారు. ఈ నేపథ్యంలో, గత 22 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.1.4 కోట్ల నగదు, 382 గ్రాముల బంగారం, 6 కిలోల 715 గ్రాముల వెండిని కానుకలుగా సమర్పించినట్లు ఆలయ ట్రస్టీ కమిటీ అధ్యక్షుడు శ్రీధరన్ తెలిపారు.

కొండ రైలు మార్గంపై పడిన బండరాళ్లు



రైలు మార్గంపై పడిన రాళ్లు

పెరంబూర్, మే 18: నీలగిరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురు స్తు న్నా యి. భారీవర్షాల కారణంగా పర్యాటకులు జిల్లాకు రావొద్దని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, శనివారం కున్నూర్‌లో 17 మి.మీ, మేట్టుపాళయంలో 37 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా కున్నూర్ సమీపంలోని కొండ రైలుమార్గంపై బండరాళ్లు, మట్టి చెరియలు పడ్డాయి. దీంతో, శనివారం మేట్టుపాళయం నుంచి ఊటీ కొండ రైలును రద్దు చేసిన అధికారులు, రైలుపట్టాలపై పడిన రాళ్లు, మట్టి తొలగించే పనులు చేపట్టారు.

థాయ్‌లాండ్, సౌదీలకు అదనపు విమాన సేవలు

ఐసిఎఫ్, మే 18: ప్రయాణికుల సౌకర్యార్థం థాయ్‌లాండ్, సౌదీ అరేబియా, పశ్చిమ బెంగాల్‌కు అదనపు విమానసేవలు నడపనున్నట్లు చెన్నై విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ విమాన సంస్థ చెన్నై నుంచి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్, అక్కడి నుంచి చెన్నైకి రెండు విమానసేవలను ఈనెల 15 నుంచి ప్రారంభించింది. ఈ విమానాలు వారంలో నాలుగు రోజులు నడుస్తున్నాయి. అలాగే, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ సౌదీ అరేబియా, అక్కడి నుంచి చెన్నైకు జూన్ 1వ తేది నుంచి రెండు విమానసేవలు ప్రారంభించనుంది. ఈ విమానాలు వారంలో మంగళ, శనివారాల్లో నడువనున్నాయి. ఇదే విధంగా డొమెస్టిక్ విమానాశ్రయం నుంచి పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌కు, అక్కడి నుంచి చెన్నైకు ఈ నెల 16వ తేది నేరుగా విమానసేవలు ప్రారంభించారు. ఈ విమానాలు వారంలో మంగళ, గురు, శనివారాల్లో ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ నడపనుంది.

రూ.100 కోట్లతో తిరునిండ్రవూర్ జలాశయ పునరుద్ధరణ

ఐసిఎఫ్, మే 18: నగర ప్రజల తాగునీటి అవసరాలకు తిరునిండ్రవూర్ జలాశయాన్ని రూ.100 కోట్లతో పునరుద్ధరించనున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. నగరవాసులకు నెలకు టీఎంసీ తాగునీరు అవసరమవుతోంది. ప్రస్తుతం జలాశయాల్లో ఉన్న నీటితో మరో 9 నెలలు అవసరాలు పూర్తిచేయవచ్చు. ఈ నేపథ్యంలో, అదనంగా నీటి నిల్వకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పోరూర్, రెట్టేరి, అయనం బాక్కం, తిరునిండ్రవూర్, ఆవడి జలాశయాలను పునరుద్ధరించనున్నారు. వాటిలో రూ.100 కోట్లతో తిరునిండ్రవూర్ జలాశయాన్ని పునరుద్ధరించే పనులు త్వరలో ప్రారంభించనున్నామని అధికారులు తెలిపారు.

ఇంట్లో నిర్బంధించిన 18 శునకాలకు విముక్తి

ఐసిఎఫ్, మే 18: ఇంట్లో సరైన పర్యవేక్షణ లేకుండా నిర్బంధించిన 18 శునకాలకు విముక్తి కల్పించిన పోలీసులు, పరారీలో ఉన్న మహిళ కోసం గాలిస్తున్నారు. పూందమల్లి సమీపంలోని కాట్టుపాక్కం ఇందిరానగర్‌లో ఉన్న ఓ ఇంట్లో ప్రియ అనే మహిళ శునకాలను సంరక్షిస్తోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు, ఇళ్లలో స్థలం లేక సంరక్షించలేని వారు తమ శునకాలను ప్రియకు అప్పగిస్తున్నారు. వారి నుంచి నగదు తీసుకుంటున్న ప్రియ శునకాలను పర్యవేక్షిస్తున్నారు. కొన్ని వారాలుగా ఇంటికి తాళం వేసి ఉండడంతో అనుమానించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా, ఆహారం లేక బలహీనంగా ఉన్న శునకాలను స్వాధీనం చేసుకొని వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. పరారైన ప్రియ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మాజీ వీసీ ఇంట్లో 100 సవర్ల నగల చోరీ

ఐసిఎఫ్, మే 18: మాజీ ఉపకులపతి ఇంట్లో 100 సవర్ల నగలు చోరీకి గురయ్యాయి. తూత్తుకుడి చిన్నమణి నగర్ రెండో వీధిలో జయలలిత మత్స్య వర్శిటీ మాజీ వీసీ సుకుమార్, పునిత దంపతులు నివసిస్తున్నారు. ఈ నెల 10వ తేది చెన్నైలో ఉన్న కుమార్తెను చూసేందుకు వెళ్లారు. ఇంట్లో తూత్తుకుడి శివన్ కాలనీకి చెందిన అముద అనే మహిళ ఇంటి పనులు పర్యవేక్షిస్తోంది. శుక్రవారం సాయంత్రం యథావిధిగా ఇంట్లో పనులు పూర్తిచేసి సాయంత్రం బయల్దేరి వెళ్లింది. శనివారం ఉదయం ఇంటికి వచ్చిన ఆమె తలుపులు తెరచి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందింది. వెంటనే సుకుమార్‌ను ఫోన్‌లో సంప్రదించి సమాచారం అందించింది. ఆయన ఫిర్యాదుతో పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరచి వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పోలీసుల విచారణలో... లాకర్‌లో ఉన్న 100 సవర్ల నగలు చోరీకి గురైనట్లు తెలిసింది. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.



ఆండ్రియా, వెట్రిమారన్, కవిన్ తదితరులు

వెట్రిమారన్ నిర్మాతగా కవిన్ కొత్త చిత్రం

యువ హీరో కవిన్ లక్కీఛాన్స్ వరించింది. జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ నిర్మాణంలో రూపుదిద్దుకునే చిత్రంలో నటించే గొప్ప అవకాశాన్ని దక్కించుకున్నారు. ఎస్.పి.చొక్కలింగం నిర్మాతగా వెండితెరకు పరిచయమవుతున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చనున్నారు. 'కాక్కా ముట్టై', 'విచారణై', 'కొడి', 'వడచెన్నై' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ, బ్లాక్ మద్రాస్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు 'మాస్క్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. వికర్ణన్ అశోకన్ దర్శకుడు. ఈయన తెరకెక్కించిన షార్ట్‌ఫిల్మ్ 'తరుమి'తో గోల్డ్ మెడల్ అందుకున్నారు. కవిన్ హీరోగా నటించే ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఆండ్రియా నటిస్తుండగా, ఇతర పాత్రల్లో చార్లీ, రుహానీ శర్మ, బాల శరవణన్, వీజే అర్చనా, సంతోష్ తదితరులు నటించారు. ఈ సినిమా ప్రారంభ పూజా కార్యక్రమం ఇటీవల జరుపుకోగా, ఈ నెలాఖరులో చెన్నైలో చిత్రీకరణను ప్రారంభించనున్నారు.

చిత్రజ్యోతి



సమయమంతా మేకప్‌కే సరిపోతోంది

● సంయుక్తా

హీరో ధనుష్ నటించిన 'వాత్తి' చిత్రం ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన కన్నడ బ్యూటీ సంయుక్తా (సంయుక్తా మేనన్). తమిళం, తెలుగు, మలయాళ చిత్రపరిశ్రమల గురించి కామెంట్స్ చేశారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... 'తెలుగు చిత్రాల్లో నటించడం నాకు ఎంతో కష్టంగా అనిపిస్తుంది. దానికి కారణం ఓవర్ మేకప్ వేసుకోవడమే. మలయాళం, తమిళ చిత్రాల్లో నటించేటపుడు మేకప్ వేసుకోవాల్సిన పనే ఉండదు. సహజంగా ఒక మహిళ ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్ళేటపుడు ఎలాంటి మేకప్ వేసుకుంటుందో అలాంటి మేకప్ ఉంటే సరిపోతుంది. కానీ, తెలుగు చిత్రాల షూటింగ్ సమయాల్లో మాత్రం మేకప్ వేసుకోవడమే ఒక పెద్ద పనిగా ఉంటుంది. సగం సమయం మేకప్ వేసుకోవడానికే సరిపోతుంది' అని వ్యాఖ్యానించారు.

నా చిత్రంలో కథే హీరో : అశోక్ సెల్వన్



అశోక్ సెల్వన్, అవంతికా మిశ్రా

తాను నటించే చిత్రంలో కథే హీరో అని కథానాయకుడు అశోక్ సెల్వన్ అన్నారు. డెబ్యూ డైరెక్టర్ బాలాజీ కేశవన్ దర్శకత్వంలో అశోక్ సెల్వన్, అవంతికా మిశ్రా జంటగా ప్రేమ, హాస్యభరిత చిత్రంగా 'ఎమక్కు తొళిల్ రొమాన్స్' తెరకెక్కింది. ఈ చిత్రం ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. టి.క్రియేషన్స్ పతాకంపై నిర్మాత తిరుమలై ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కు ఇప్పటికే ఆడియన్స్ నుంచి మంచి స్పందన రాగా, తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. రొమాన్స్‌లో మునిగితేలే ఒక యువకుడు, తద్వారా ఎదురయ్యే సమస్యలు, అతనికి సాయపడే ఫ్యామిలీ, స్నేహితులు ఇలా అన్ని అంశాలతో హాస్యభరిత ప్రేమ కథా చిత్రంగా రూపొందించారు. ఇందులో అశోక్ సెల్వన్ ఒక ప్లేబాయ్ పాత్రను పోషించారు. సీనియర్ నటి ఊర్వశి ఓ ముఖ్య పాత్రలో నటించారు. నిర్మాణాంతర కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా గురించి హీరో అశోక్ సెల్వన్ మాట్లాడుతూ... గత చిత్రాలకు ఇది భిన్నంగా ఉంటుంది. నా చిత్రాల్లో కథే హీరో. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు నిరాశపరిచిన సందర్భాలు లేవు. ఈ సినిమా కూడా మంచి కథాంశంతో రూపుదిద్దుకుంది' అని వెల్లడించారు.

వెబ్ సిరీస్ కోసం...

● బాడీ లాంగ్వేజ్‌ను మార్చుకున్న శ్రేయారెడ్డి



దర్శకుడు వసంత్ బాలన్ దర్శకత్వం వహించిన 'తలమై సెయలగం' కోసం ప్రముఖ నటి శ్రేయారెడ్డి తన బాడీ లాంగ్వేజ్‌తో పాటు తన శరీర సౌష్టవాన్ని మార్చుకున్నారు. కిషోర్, శ్రేయా రెడ్డి, భరత్, రమ్య నంబీశన్, ఆదిత్య మేనన్, నిరూప్ నందకుమార్, దర్శా గుప్తా, కవితా భారతి వంటివారు నటించిన ఈ వెబ్ సిరీస్ జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. సినీ నటి రాధికా శరత్‌కుమార్, నటుడు ఆర్.శరత్‌కుమార్ కలిసి రాడాన్ మీడియా వర్క్స్ ఇండియా లిమిటెడ్ పతాకంపై నిర్మించారు. ఈ సిరీస్‌లో శ్రేయా రెడ్డి అతి ముఖ్యమైన పాత్రను పోషించారు. ఇందుకోసం పాత్ర డిమాండ్ మేరకు తనను అన్ని విధాలుగా మార్చుకున్నారు. పైగా వసంతబాలన్ దర్శకత్వం కావడంతో ఎలాంటి భయం లేకుండా ఆమె దర్శకుడు చెప్పినట్టుగా తనను తాను మార్చుకుని నటించారు. దీంతో ఆమె పాత్రను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. రాజకీయ నేపథ్యంలో ఈ వెబ్ సిరీస్ తెరకెక్కింది. కాగా, విశాల్ 'తిమిరు' చిత్రంలో విలన్ పాత్రను పోషించి మంచి పేరుతో పాటు గుర్తింపు తెచ్చుకున్న శ్రేయారెడ్డి... ఆ తర్వాత విశాల్ అన్నను పెళ్ళి చేసుకుని సినిమాలకు దూరమయ్యారు. గత కొన్ని నెలలుగా మళ్లీ సినిమాల్లో నటిస్తూ, వరుస అవకాశాలను దక్కించుకుంటున్నారు.

ఆలయాల నగరం... ఇత్తడి వస్తువులమయం

కుంభకోణం ఆలయాలకే కాదు మేలిరకం ఇత్తడి, రాగి, కంచు, సీసపు పాత్రలు, కళాత్మక వస్తువుల తయారీకి పెట్టింది పేరు. ఆ నగరం చుట్టూ వందకు పైగా ఉన్న కర్మాగారాల్లో నిత్యం ఇత్తడి, రాగి, కంచు లోహాల శబ్దాలే వినిపిస్తాయి. రాత్రనక పగలనక కార్మికులు ఇత్తడి, రాగి, కంచు, సీసంతో అందమైన బిందెలు, చెంబులు, రైలు కూజాలు, గ్లాసులు, వంట పాత్రలు తయారు చేస్తూనే ఉంటారు. ప్రాచీనతకు ఏమాత్రం భంగం కలుగని రీతిలో ఆలయాలకు అవసరమైన వస్తువులు కూడా ఈ కర్మాగారాల్లోనే తయారవుతుంటాయి.

- చెన్నై, ఆంధ్రజ్యోతి



బిందెల తయారీకి ఇత్తడి రేకులను కత్తిరిస్తున్న కార్మికుడు

కుంభకోణం బిందె...



ఇత్తడి రేకును సాపు చేస్తున్న కార్మికకుడు

గతంలో ఏ రాష్ట్రంలో ఎక్కడ పెళ్లిళ్లు, సీమంతాలు జరిగినా కుంభకోణం బిందె నిండుగా లడ్డూలు, జిలేబీలు నింపి, పైన పసుపు వస్త్రాన్ని కట్టి ఇవ్వడం ఆనవాయితీగా ఉండేది. ఇప్పటికీ తంజావూరు, మదురై, తిరువారూరు, తిరుచ్చి తదితర నగరాల్లో పెళ్లి వేడుకల్లో ఇత్తడి పాత్రలను వధూవరులకు కానుకలుగా ఇస్తున్నారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో స్టీలు, ప్లాస్టిక్ వస్తువుల వాడకం అధికమై ఇత్తడి, రాగితో తయారైన వస్తువులకు గిరాకీ లేదంటే అతిశయోక్తి కాదు. ఇళ్లల్లో స్టీలు వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు కుప్పలు తెప్పలుగా పడివున్నా పసిడి కాంతులతో తళతళ మెరిసే చిన్న ఇత్తడి చెంబు లేదా రాగి చెంబు, నట్టింట ఇత్తడి కలశం, రాగి పంచపాత్ర తప్పనిసరిగా ఉంటాయి. ఇటీవల ఇత్తడి, రాగి ఫ్లవర్ వాజ్‌లు వినియోగం ఫ్యాషన్‌గా మారింది. వీటన్నింటికంటే ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల ప్రారంభోత్సవాలకు ఎత్తయిన ఇత్తడి పంచముఖ దీపస్తంభాన్ని జ్యోతి ప్రజ్వలనం కోసం తప్పనిసరిగా వాడుతుంటారు. ఇక ఆలయాలు, మసీదులు, చర్చిలు తదితర ప్రార్థన స్థలాల్లో ఇప్పటికీ ఇత్తడి, రాగితో తయారైన వస్తువుల వినియోగం కొనసాగుతుతూనే ఉంది. హిందువుల దేవాలయాల్లో ప్రధాన ద్వారం ఇత్తడి మేకులు, రేకులతోనే తయారవుతున్నాయి. ఆలయాల ధ్వజస్తంభాలు కూడా ఇత్తడి రేకులతోనే తళతళా మెరుస్తుంటాయి. మూలవిరాట్టుకు కర్పూర హారతిని ఇత్తడి పళ్లెంతోనే జరుపుతున్నారు. మోగించే గంట ఇత్తడి కలిపిన కంచుతో తయారైనవే! ఇక గుడి గంటలు కూడా ఇత్తడి కంచు మిశ్రమంతో తయారైనవే. చర్చిల్లో గంటలు మేలి రకం ఇత్తడితో తయారైనవే. ఇక మసీదులలో వాడే పూజాది కార్యక్రమాలకు ఉపయోగించే పరికరాలు కూడా ఇత్తడితో చేసినవే. ఇలా అన్ని మతాలవారిని ఆకట్టుకునే ఇత్తడి, రాగి, కంచుతో తయారైన వస్తువులను కళాత్మకంగా ప్రాచీనతకు భంగం కలుగని రీతిలో తయారు చేసే కర్మాగారాలు, కళాకారులున్న నగరమే కుంభకోణం.



ఇత్తడి పాత్ర చుట్టూ ఉన్న రేకును కత్తిరిస్తున్న కార్మికుడు



ప్రెస్సింగ్ మెషిన్ నుంచి ఇత్తడి పాత్రను వెలికి తీస్తున్న మహిళ

అలాగైతేనే మా పరిస్థితి బాగు

● తయారీదారు రాజగోపాల్

"మా వంశంలో ఇత్తడి వస్తువుల తయారీలో నేను రెండో తరానికి చెందినవాడిని. ప్రాచీనకళను పెంచి పోషించే రీతిలోనే మేము ఇత్తడి, కంచు వస్తువులను తయారు చేస్తున్నాం. ఇత్తడి వస్తువుల తయారీ కర్మాగారం నడిపేందుకు సుమారు 10 నుంచి 15 మంది కార్మికులు అవసరం. 450 నుంచి 1500 గ్రాముల బరువు దాకా ఇత్తడి, కంచు వస్తువులను కళాత్మకంగా తయారు చేస్తాం. ఇటీవల రాగి గ్లాసులకు గిరాకీ పెరిగింది. రాగి గ్లాసులో మంచినీరు తాగితే ఆరోగ్యానికి శ్రేయస్కరమంటూ వైద్యులు చెబుతుండటంతో మేలిమి రాగి రేకులతో గ్లాసులను కూడా తయారు చేస్తున్నాం. పొంగల్ పండుగ వస్తే ఇత్తడి బిందెలు, క్షీరకలశాల తయారీకి ఆర్డర్లు ఎక్కువగా వస్తాయి. ఈ క్షీర కలశాలు రూ.400 నుంచి రూ.1500కు లభిస్తాయి. మేము తయారు చేసే ఇత్తడి, కంచు వస్తువులను నేరుగా దుకాణాలకు విక్రయించలేం. తొలుత అడ్వాన్స్‌కు కొంత సొమ్మును ఇచ్చి అన్ని వస్తువులను తీసుకెళతారు. మిగతా సొమ్మును వస్తువులు అమ్ముడైన తర్వాతే ఇస్తారు. ఇందువల్ల మేము శ్రమకు తగిన ఫలితాన్ని సకాలంలో అనుభవించలేకపోతున్నాం. మా కర్మాగారం నుంచి సరఫరా చేసే ఇత్తడి, కంచు, సీసపు వస్తువులను దుకాణదారులు రెట్టింపు ధరలకు విక్రయించి లాభాలు ఆర్జిస్తారు. కానీ మేం మాత్రం నష్టాల్లోనే వుండిపోవాల్సి వస్తుంది. దాంతో కర్మాగారంలో పనిచేసే కార్మికులకు జీతాలను సకాలంలో చెల్లించలేకపోతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం మాకు సబ్సిడీ ధరలపై ఇత్తడి, రాగి రేకులను, సీసాన్ని సరఫరా చేస్తే గడ్డుపరిస్థితి నుంచి బయటపడగలం. నేటి యువత ఇత్తడి, కంచు, సీసపు బిందెలు, కలశాలు తదితర కళాత్మక వస్తువుల తయారీపై దృష్టి సారించకపోవడం శోచనీయం. సామాజిక ప్రసారమాధ్యమాలు ఇత్తడి, రాగి, కంచుతో తయారైన వస్తువులు ఆరోగ్యానికి శ్రేయస్కరమంటూ విస్తృతంగా ప్రచారం చేస్తే మా పరిస్థితి బాగుపడుతుంది" అంటూ రాజగోపాల్ వాపోయారు. ఐదు దశాబ్దాలపాటు ఇత్తడి, కంచు, సీసపు పాత్రలు, కళాత్మక వస్తువుల తయారీని కులవృత్తిగా చేస్తున్న సరస్వతి మెటల్స్ సంస్థ రాజగోపాల్. రాజగోపాల్ ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్నారు. ఓ వైపు చదువుతూనే మరో వైపు ఇత్తడి వస్తువుల తయారీ కర్మాగారాన్ని నడుపుతున్నారు. తాను చదువుతున్న కళాశాల విద్యార్థులు పలు ప్రాంతాల్లో ఇత్తడి, రాగి, కంచు వస్తువుల వాడకం వల్లే కలిగే ప్రయోజనాలు గురించి విస్తృతంగా ప్రచారం చేస్తుండటం తనకెంతో ఆనందంగా ఉందని రాజగోపాల్ తెలిపారు. ఏది ఏమైనప్పటికీ స్టెయిన్‌లెస్ స్టీలు వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు వినియోగం అధికమైనా ఇత్తడి, రాగి వస్తువులకు గిరాకీ ఏ మాత్రం తగ్గలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



పాలిష్ పూర్తి చేసుకున్న బిందెను పరిశీలిస్తున్న కార్మికుడు





ఇత్తడి పాత్రలపై నగిషీలు చెక్కుతున్న కార్మికుడు - పాత్రల కంఠాలను వెల్డింగ్ చేస్తున్న కార్మికులు

వందకుపైగా కర్మాగారాలు...

చుట్టూ సుమారు వందకు పైగా ఇత్తడి, రాగి, సీసపు వస్తువుల తయారీ కర్మాగారాలు ఉన్నాయి. వీటిలో కుంభకోణం సమీపంలోని దారాసురం కర్మాగారంలో ఎక్కువగా ఇత్తడి బిందెలు, చెంబులు, ఆలయాలలో ఉపయోగించే క్షీర కలశాలు తయారు చేస్తున్నారు. తొలుత తయారు చేసే బిందె లేదా చెంబు సైజును బట్టి కొలతలు గణించి ఇత్తడి రేకులను కత్తిరించుకుంటారు. తొలుత బిందె దిగువ భాగాన్ని మెషిన్ ప్రెసింగ్ ద్వారా సిద్ధం చేసుకుంటారు. ఇదే విధంగా బిందె పైభాగాన్ని కూడా ప్రెసింగ్ ద్వారా తయారు చేస్తారు. చివరకు పైభాగాన్ని కింది భాగాన్ని వెల్డింగ్ చేస్తారు. చివరగా బిందె మెడభాగాన్ని కళాత్మకంగా తయారు చేసి జతపరుస్తారు. ఇలా బిందె సంపూర్ణ రూపం దాల్చిన తరువాత పాలిష్ చేస్తే పసిడిలా తళతళలాడుతుంది. ఇదే విధానంతో చిన్న సైజుగ్లాసులు, పెద్ద సైజు గ్లాసులు, పూల కుండీలు, పూజగదిలో ఉంచే పంచపాత్రలు, దీపాలు, హారతి పళ్లెం, తాంబూల పళ్లెరాలు, క్షీరకళాశాలు, కమండలాలు కూడా తయారు చేస్తున్నారు.



ఇత్తడి బిందెలకు పాలిష్ చేస్తున్న కార్మికుడు

చిన్నారుల్లో ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతులు వెలిగిస్తున్న జియ్యర్ ట్రస్ట్

● ప్రజ్ఞ ముగింపు సమ్మర్ క్యాంప్‌లో వక్తలు



ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులతో జియ్యర్ ట్రస్ట్ నిర్వాహకులు

ప్యారీస్, మే 18: ఆధ్యాత్మిక రంగానికి సంబంధించిన అనేక విషయాలపై వివిధ పోటీలు నిర్వహిస్తున్న జియ్యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్), చెన్నై విభాగం చిన్నారుల్లో జ్ఞానజ్యోతులు వెలిగిస్తోందని పలువురు వక్తలు ప్రశంసించారు. మైలాపూర్‌లోని ఆంధ్ర మహిళా సభ ప్రాంగణంలో ఈనెల 13 నుంచి శనివారం వరకు ఆరు రోజుల సమ్మర్ క్యాంప్‌ను త్రిదండి చిన్నజీయర్ మంగళాశాసనాలతో ఘనంగా నిర్వహించారు. భగవంతుడి ఐదు రూపాలు (పరత్వాది పంచకం) అనే అంశంపై భగవంతుడి ఐదు రూపాల కథలు, కథలకు సంబంధించిన ప్రాజెక్ట్ వర్క్, భజనలు, ఆధ్యాత్మిక ఆటలు తదితర పోటీల్లో 52 మందికి పైగా చిన్నారులు ఆసక్తిగా పాల్గొన్నారు. రామాయణంపై జరిగిన క్విజ్ పోటీల్లో సీనియర్, జూనియర్ బృందాల విజేతలకు బహుమతులు, చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవీంద్రకుమార్ రెడ్డి, అన్నపూర్ణ, ఉమ్మిడి లలితా సుధాకర్, మీరా శేఖర్, విశ్వంభర, పి.కమల, సునంధ, శాంతి సుబ్బారావు, సీత హేమ, పద్మశ్రీ, రాజప్ప, శారద, చలపతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా వాసవి మాత విజయం



వాసవి మాత విజయోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు

ప్యారీస్, మే 18: స్థానిక వెస్ట్ మాంబళంలోని వీకేసీ కల్చరల్ హాలులో వాసవి మాత విజయం ఉత్సవాన్ని లోకసంక్షేమార్థం శనివారం వైభవంగా నిర్వహించారు. వాసవి క్లబ్ మాంబళం, మాంబళం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారికి హోమం, అభిషేకం, దీపాల పూజ, కుంకుమార్చన తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు వీఎన్ కమలనాథన్, డాక్టర్ సెంథిల్‌కుమార్, కామరాజ్, మదుర ఎస్.వాసుదేశన్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 5.30 గంటలకు గణపతి, నవగ్రహ, నక్షత్ర హోమాలు, పూర్ణాహుతి అనంతరం మహా దీపారాధన, ప్రసాదం వినియోగం జరిగింది.

అటవీశాఖ ఆధీనంలోకి కుట్రాలం జలపాతం



వరదలు సంభవించిన కుట్రాలం జలపాతాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

పెరంబూర్, మే 18: కుట్రాలంలోని పాత, ప్రధాన జలపాతాలను అటవీ శాఖకు అప్పగించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించినట్లు సమాచారం. పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాల కారణంగా కుట్రాలం జలపాతంలో శుక్రవారం నీటి ఉధృతికి ఓ బాలుడు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన పర్యాటకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో, ప్రజాపనుల శాఖ పర్యవేక్షణలో ఉన్న పాత, ప్రధాన జలపాతాలను అటవీ శాఖకు అప్పగించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఐందరువి జలపాతం అటవీ శాఖ ఆధీనంలో ఉండగా, తాజాగా పర్యాటకుల భద్రత దృష్టిలో ఉంచుకొని మరో రెండు జలపాతాలను అప్పగించాలని తెన్‌కాశి జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

'సర్ఫింగ్' శిక్షణలో యువకులు



సర్ఫింగ్ శిక్షణలో యువకుడు

పెరంబూర్, మే 18: సముద్ర తీర ప్రాంతాల్లో అలలపై 'సర్ఫింగ్' క్రీడ ప్రసిద్ధిచెందింది. రాష్ట్రంలో ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన మహాబలిపురం సముద్రతీరంలో యువకులు సర్ఫింగ్ శిక్షణ పొందుతున్నారు. సముద్ర ఉపరితలంలో చిన్న పలకపై నిలబడి, కింద పడకుండా, అలల తాకిడికి చిక్కకుండా చేతులు, కాళ్లు, శరీరాన్ని వంచుతూ వెళ్లడమే 'సర్ఫింగ్'. తొలుత ఈ క్రీడలో జాలర్ల కుటుంబాలకు చెందిన యువత మాత్రమే పాల్గొంటారు. ప్రస్తుతం అనేక మంది యువకులు ఈ క్రీడపై శిక్షణ తీసుకుంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించే సర్ఫింగ్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ క్రీడ మానసిక ఉల్లాసం, శారీరక బలం, కొత్త అనుభూతి ఇస్తుండడంతో యువకులు ఎక్కువ మంది శిక్షణ పొందుతున్నారని కోచ్‌లు తెలిపారు.

ఏనుగులకు 'గుమ్కీ' శిక్షణ



శిక్షణలో ఏనుగు

పెరంబూర్, మే 18: నీలగిరి జిల్లా గూడలూరు సమీపం ముదుమలై, తెప్పకాడు ఏనుగుల శరణాలయాల్లో ఉన్న పెంపుడు ఏనుగులకు 'గుమ్కీ' శిక్షణ అందిస్తున్నారు. ఈ శరణాలయాల్లో రెండు గున్న ఏనుగులు సహా 29 ఏనుగులు సంరక్షిస్తున్నారు. వాటిలో ఆరు ఏనుగులు విధుల నుంచి రిటైర్ అయ్యాయి. గ్రామాల్లో ప్రవేశించే అడవి ఏనుగులను లొంగతీసుకోవడం, వాహనాల్లో ఎక్కించడం తదితర పనులను పెంపుడు ఏనుగులు చేస్తుంటాయి. ఇందుకోసం ఏనుగులకు గుమ్కీ శిక్షణ ఇస్తుంటారు. ప్రస్తుతం ఈ శిబిరంలోని ఆరు ఏనుగులు వృద్ధాప్యం కారణంగా విధుల నుంచి తప్పించి, కృష్ణా, గిరి, బొమ్మి, రఘు, జంబు, మసిని తదితర ఏనుగులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శరణాలయాలు వస్తున్న పర్యాటకులు ఏనుగుల శిక్షణ ఆసక్తిగా చూస్తున్నారు.

పురుషులు మాత్రమే పాల్గొనే ఆలయ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న పురుషులు

పెరంబూర్, మే 18: మదురై జిల్లా పెరుమాళ్‌కోయిల్‌పట్టి కులదైవం కరుంపారై ముత్తయ్య ఆలయంలో పురుషులు మాత్రమే పాల్గొనే వేడుకలు శనివారం కోలాహలంగా జరిగాయి. వర్షాలు కురవాలి, యువకులకు ఉపాధి లభించాలి, వ్యవసాయ దిగుబడులు పెరగాలి, వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా జీవించాలి అంటూ యేటా ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామివారికి నల్ల మేకలు మాత్రమే బలి ఇస్తుంటారు. తొలుత స్వామివారిని మొక్కుకున్న భక్తులు, మేకలను ఆలయ ప్రాంగణంలో వదిలివెళ్తుంటారు. ఆ మేకలు మేత కోసం సమీపంలోని పొలాలకు వెళ్లినప్పుడు, ముత్తయ్య స్వామి స్వయంగా ఆహారం కోసం వచ్చినట్లు భావించే ప్రజలు, రైతులు ఆ మేకలను పొలాల నుంచి తరమరు. వేడుకలకు వారం రోజులు ముందుగా గ్రామం చుట్టుపక్కల ఉన్న మేకలను ఆలయానికి తీసుకొచ్చి స్వామివారి సన్నిధిలో బలి ఇస్తారు. ఈ క్రమంలో, శనివారం జరిగిన వేడుకల్లో 125 నల్ల మేకలను బలిచ్చి, 2,500 కిలోలతో వంటకాలు చేశారు. ఈ వేడుకల్లో సుమారు 10 వేల మందికి పైగా పాల్గొన్నారు. భక్తులు కింద కూర్చొని అరిటాకుల్లో అన్నం, మాంసం కూర వేసుకొని భుజించిన తర్వాత, ఆకులను అలాగే వదిలి వెళతారు. వారం రోజుల తర్వాత అరిటాకులు ఎండిపోయిన తర్వాత మహిళలు ఆలయానికి వచ్చి స్వామిదర్శనం చేసుకుంటారు.